క్లుప్తంగా

లేగ దూడల ప్రదర్శన



వెంటూరులో లేగదూడల ప్రదర్శన

రాయవరం: వెంటూరులో లేగదూడల ప్రదర్శన ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ నాగశ్రావణి మాట్లాడుతూ లేగదూడల పెంపకంలో లాభనష్టాలు, వాటి ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన మెలకువలను రైతులకు వివరించారు. వెంటూరు, పరిసర గ్రామాలకు చెందిన లేగ దూడలను రైతులు ప్రదర్శనలో ఉంచారు. ప్రదర్శన అనంతరం ఆరోగ్యంగా ఉన్న లేగదూడలకు బహుమతులు అందజేశారు. వెంటూరుకు చెందిన జీవీవీ సత్యనారాయణకు చెందిన లేగదూడ ప్రథమ, నరాల రాజేంద్రప్రసాద్‌కు చెందిన లేగదూడ ద్వితీయ, నిమ్మలపూడి వీరవెంకటసత్యనారాయణకు చెందిన లేగదూడ తృతీయ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సర్పంచ్ వాసంశెట్టి వెంకట్రావు, ఉప సర్పంచ్ నున్న ప్రదీప్‌కుమార్, వైస్ ఎంపీపీ గుబ్బల సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ వాసంశెట్టి విజయకుమార్, మాజీ సర్పంచ్ వాసంశెట్టి రాధాకృష్ణ పాల్గొన్నారు.

రేపు గొల్లాలమ్మ జాతర

కె.గంగవరం: అముజూరు గ్రామ దేవత గొల్లాలమ్మ అమ్మవారి జాతర మంగళవారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఏటా మాదిరిగా ఘనంగా నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. జాతర అనంతరం బుధవారం ఆలయం వద్ద తీర్థం జరుగుతుందన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం

కపిలేశ్వరపురం: టేకిలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. పెద్దింటి వెంకట లక్ష్మీ నరసింహాచార్యులు, ప్రసన్నకుమార్, భార్గవ్‌ల పర్యవేక్షణలో వేదపండితులు స్వామి వారికి విశేష పూజలు చేసి, కల్యాణ తంతు నిర్వహించారు. కల్యాణాన్ని భక్తులు తిలకించారు. సోమవారం ఆలయం వద్ద అన్నదానం, తెప్పోత్సవం నిర్వహించనున్నట్టు ఉత్సవ నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.

సాయిబాబా జ్ఞాన మందిర వార్షికోత్సవం

రామచంద్రపురం రూరల్: హసన్‌బాదలో షిరిడీ సాయిబాబా జ్ఞాన మందిరం 21వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, విజయలక్ష్మి దంపతుల చేతుల మీదుగా పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. సాయంత్రం బాబాను పల్లకీలో ఊరేగించారు. తోటపేటకు చెందిన లక్ష్మీ గణపతి భజన బృందం భజనలు భక్తులను అలరించాయి.

మంత్రి వేణు పరామర్శ

రామచంద్రపురం రూరల్: ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన వేగాయమ్మపేటకు చెందిన పితాని శ్రీనివాస్ కుటుంబ సభ్యులను రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆదివారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గ్రామ సర్పంచ్ అంబటి తుకారం, నాయకులు గెద్దాడ సుబ్రహ్మణ్యం, అంబటి నెహ్రూ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. శనివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భీమక్రోసుపాలెంకు చెందిన యువకుడు పెనుమళ్ల సాయికుమార్‌రెడ్డి తండ్రి పెనుమళ్ల శ్రీహరి కృష్ణారెడ్డిని మంత్రి వేణు పరామర్శించారు. గ్రామ సర్పంచ్ పలివెల లోవరాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ మృతికి సంతాపం

కపిలేశ్వరపురం: కోరుమిల్లి మాజీ ఎంపీటీసీ పంచికట్ల సోమేశ్వరరావు మృతికి ఆ గ్రామ మాజీ సర్పంచ్ సలాది వీరబాబు సంతాపం వ్యక్తం చేశారు. సోమేశ్వరరావు కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించి ఓదార్చారు. సోమేశ్వరరావు ఎంపీటీసీగా గ్రామాభివృద్ధికి కృషి చేశారన్నారు.

భర్త వేధింపులపై కేసు

రాయవరం: తన భర్త వేధింపులకు గురి చేస్తున్నాడంటూ భార్య ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు రాయవరం పోలీసులు తెలిపారు. ఎస్సై పీవీవీఎస్ఎన్ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం వెదురుపాకకు చెందిన విజయకు మదాపట్నం గ్రామానికి చెందిన రాయుడు గోవింద్‌తో 2011లో వివాహమైంది. ఇదిలా ఉండగా గత కొంత కాలంగా భర్త గోవిందు తనను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నట్టు విజయ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

బాధిత కుటుంబాలకు సాయం

కాజులూరు: గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులకు జనసేన నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. దుగ్గుదుర్రుకు చెందిన అతంపూడి అన్నవరం, మంజేరుకు చెందిన ముడుకు వెంకటేశ్వర్రావు, పెనుమళ్ళకు చెందిన పలివెల లక్ష్మీ కుటుంబ సభ్యులను పార్టీ నియోజక ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పార్టీ మండల అధ్యక్షుడు బొండా వెంకన్న తదితరులు ఆదివారం పరామర్శించి, నగదు, నిత్యావసర సరకులు అందించారు. డొక్కా సీతమ్మ అసరా పథకంలో భాగంగా పోలిశెట్టి లక్ష్మీసుబ్బారావు మెమోరియల్ ట్రస్టు ద్వారా ఈ సరుకులు అందజేశారు.

వరించింది

- ఆశాజనకంగా రబీ వరి సాగు
- ఎకరాకు 50-55 బస్తాల దిగుబడి
- పంటకోత ప్రయోగాల్లో వెల్లడవుతున్న గణాంకాలు
- క్లస్టర్ పరిధిలో 1.01 లక్షల ఎకరాల్లో సాగు



పంట కోత ప్రయోగం చేపడుతున్న వ్యవసాయ, రెవెన్యూ, గణాంక శాఖ అధికారులు



లొల్ల గ్రామంలో యంత్రంతో వరికోత

రాయవరం: ఈ ఏడాది రబీ వరి సాగు ఆశాజనకంగా ఉంది. దిగుబడి అనుకున్న స్థాయిలో లభిస్తోంది. దీంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ, రెవెన్యూ, గణాంక శాఖలు సంయుక్తంగా చేపడుతున్న పంట కోత ప్రయోగాల్లో ఆశించినదానికి కుంటే ఎక్కువ దిగుబడులు రావడం అటు వ్యవసాయ శాఖ అధికారులు, ఇటు రైతులు సంతోష పడుతున్నారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం, మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లో 1.01 ఎకరాల్లో రబీ వరిసాగును రైతులు చేపట్టారు. రబీలో 90 శాతం ఎంటీయూ 3626(బొండాలు) రకాన్ని సాగు చేయగా, మిగిలిన 10 శాతం ఎంటీయూ 1121, 1153,1156, నెల్లూరు సన్నాలు తదితర రకాలను సాగు చేశారు. ప్రస్తుత రబీలో 95 శాతం మంది రైతులు వెదజల్లు విధానంలో సాగు చేశారు. 80 శాతం వరినాట్లు డిసెంబర్‌కు పూర్తి కావడం రబీకి మేలు చేసిందని చెప్పవచ్చు. ఈ ఏడాది చీడపీడలు తక్కువ కావడంతో రైతులకు పెట్టుబడి ఖర్చు కూడా తగ్గింది. ప్రభుత్వం సకాలంలో ఎరువులను అందుబాటులో ఉంచడంతో పాటుగా, సరైన సమయంలోనే ఎలుకల నివారణ మందును కూడా పంపిణీ చేయడం రైతులకు కలిసొచ్చిందని చెప్పవచ్చు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు అందజేస్తూ, రైతులకు అవగాహన కల్పిస్తూ వ్యవసాయశాఖ అప్రమత్తం చేసింది.

ఎకరాకు 55 బస్తాల దిగుబడి

రబీలో ఎకరాకు 50–55 బస్తాల దిగుబడి వస్తున్నట్టు పంట ప్రయోగ ఫలితాల ద్వారా వెల్లడవుతోంది. గతేడాది రబీతో పోలిస్తే ప్రస్తుతం మరింత ఆశాజనకంగా ఉంది. ఇప్పటికే రెవెన్యూ, వ్యవసాయ, గణాంక శాఖలు సంయుక్తంగా మండలానికి 40 వంతున మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో సుమారు 250 వరకూ పంట కోత ప్రయోగాలు చేయాల్సి ఉంది. ప్రస్తుతం పంటకోత ప్రయోగాలు ప్రారంభ దశలో ఉన్నాయి. ఈ ప్రయోగాల్లో ఎకరాకు 50–55 బస్తాల దిగుబడి వస్తున్నట్టు తెలుస్తోంది.

చురుగ్గా వరికోతలు

ప్రస్తుతం రబీ వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే ఐదు శాతం వరకు వరికోతలు జరిగినట్టుగా వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అధిక శాతం రైతులు వరికోత యంత్రాల సాయంతో వరికోతలు చేపడుతున్నారు. గంటకు రూ.2,200 నుంచి రూ.2,400 వరకూ యంత్రం నిర్వాహకులకు చెల్లిస్తున్నారు. ప్రతి మండలంలో 20 నుంచి 25 వరకు వరికోత యంత్రాల ద్వారా వరికోతలు చురుగ్గా సాగుతున్నాయి.

నెలాఖరుకు 50శాతం వరి కోతలు పూర్తి



గత రబీతో పోలిస్తే ఈ ఏడాది రబీ ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగానే ఉంది. రైతులు వరికోతలు చేపట్టారు. అధిక శాతం వరి కోత యంత్రాలకే ప్రాధాన్యమిస్తున్నారు. ఈ నెలాఖరుకు 50 శాతం వరకు వరికోతలు పూర్తయ్యే అవకాశముంది.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

అభివృద్ధి పనులకు భూమిపూజ

మండపేట: ఇప్పనపాడులో ఆదివారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. సర్పంచ్ కుంచే వీరవేణి, జెడ్పీటీసీ కుడుపూడి భవాని, ఎంపీటీసీ వనుం సత్యవేణి, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు తిరుశూల శ్రీనులతో కలిసి గ్రామంలోని రిలయన్స్ కాలనీలో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి, శ్మశాన వాటికలో షెడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ప్రార్టీ నాయకులు చిన్ని గంగారావు, తిరుశూల అప్పారావు, చింతలపూడి మల్లిబాబు, చిక్కాల వీర్రాజు, చోడే దుర్గాప్రసాద్‌ం దాకమర్రి దుర్గాప్రసాద్, ఓలిపల్లి దుర్గారావు, జనుమూరి శ్రీను, యాదగిరి రామకృష్ణ పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న వైస్ ఎంపీపీ రాజ్యలక్ష్మి, సర్పంచ్ అరుణ తదితరులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మండాలమ్మపేటలో అంబేడ్కర్ జయంతిని ఆదివారం నిర్వహించారు. పేట పెద్దలు, యూత్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మధ్యాహ్నం భారీ అన్నదానం చేశారు. అంబేడ్కర్ పాటలతో యువకులు, చిన్నారులు హోరెత్తించారు. గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, వైఎస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ, రామచంద్రపురం సీఐ దుర్గారావు, ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్, కె.గంగవరం ఎస్సై చిరంజీవి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

గ్రామగ్రామానా జగనన్నే మా భవిష్యత్తు



ఇప్పనపాడులో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



కూళ్లలో కరపత్రాలను లబ్ధిదారులకు అందిస్తున్న ఎంపీటీసీ దుర్గాప్రసాద్ తదితరులు



కాజులూరులో ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్న గృహసారథులు, నాయకులు

కె.గంగవరం: గ్రామగ్రామాన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. వైఎస్సార్ సీపీ శ్రేణులు, వలంటీర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పాలనపై ప్రజల నుంచి సమాచారం రాబట్టి వారి అనుమతితో ఇంటి గుమ్మానికి జగన్ స్టిక్కర్లను అతికిస్తున్నారు. మండల పరిధిలోని 26 గ్రామాల్లో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. కూళ్ల గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ పిల్లి దుర్గాప్రసాద్ పాల్గొని సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సచివాలయాల మండల కన్వీనర్ తోకల శ్రీను, వైఎస్సార్ సీపీ శ్రేణులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

కాజులూరు: కాజులూరులో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి కాజులూరు పీఏపీఎస్ చైర్‌పర్సన్ సలాది నానాజి 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాడు–నేడు ప్రభుత్వ పాలనలో వ్యత్యాసాలను వివరిస్తూ ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. ప్రజల అనుమతితో స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు యాళ్ళ సత్తిబాబు, తలాటం వీరన్న, పెదిరెడ్డి వెంకన్న, టేకుమూడి శ్రీనివాస్, మేడిశెట్టి సూరిబాబు, రాము పాల్గొన్నారు.

సంక్షేమ సాధనే లక్ష్యంగా..

కపిలేశ్వరపురం: పేదల సంక్షేమ సాధనే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని పలు గ్రామాల్లో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలన్నారు. మండలంలోని వెదురుమూడి, అద్దంకివారిలంక, కేదారిలంక, నేలటూరు, నల్లూరు గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు ఇంటింటి పర్యటన చేశారు. ప్రతి కుటుంబం వద్దకు వెళ్లి ప్రభుత్వం నుంచి వారికి అందిన లబ్ధిని వివరించారు. వారి సమ్మతిపై మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు సాకా శ్రీనివాస్, గుణ్ణం భానుప్రసాద్, నక్కా సింహాచలం, పుట్టా కృష్ణమూర్తి, సర్పంచ్‌ల సమాఖ్య నియోజకవర్గ కన్వీనర్ వీధి వెంకటరెడ్డి, ఎంపీటీసీలు యర్రంశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక ప్రభుత్వానికి ప్రజల్లో విశేష ఆదరణ

మండపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక ప్రభుత్వంపై సామాన్య ప్రజల్లో విశేష ఆదరణ ఉందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ఇప్పనపాడులో ఆదివారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి ఇంటింటా పర్యటించారు. ప్రభుత్వం నుంచి కుటుంబానికి వచ్చిన లబ్ధిని గృహ సారథులు వివరించారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వ ఆర్థికసాయాన్ని నేరుగా లబ్ధిదారుని ఖాతాకే జమ అవుతుందన్నారు. గతంలో ఇలాంటి పారదర్శకతను ఏ ప్రభుత్వంలోనూ చూడలేదన్నారు. మా నమ్మకం నీవే జగన్ అని రాసి ఉన్న స్టిక్కర్‌ను లబ్ధిదారుని గోడకు అతికించారు. ఆయన వెంట లబ్ధిదారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు నడిచారు.

పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు

అనపర్తి: రబీ సీజన్‌లో రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్ తెలిపారు. ఆదివారం స్థానిక గ్రామ సచివాలయం-5 పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు.

తొలి ధాన్యం కొనుగోలు కేంద్రం అనపర్తిలోనే..

జేసీ మాట్లాడుతూ జిల్లాలో తొలి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అనపర్తిలో ప్రారంభించామన్నారు. గత ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలులో ఏర్పడ్డ సమస్యలను అధిగమించి రబీ సీజన్‌లో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్దిష్టమైన ప్రమాణాలకు లోబడి ధాన్యం కొనుగుళ్లు నిర్వహిస్తామన్నారు. దీనిపై అధికారులు, సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చామన్నారు. దళారులు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ధాన్యం కొనుగోలు ప్రణాళికబద్ధంగా జరుగుతాయన్నారు. జిల్లాలో 233 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. అనపర్తి మండలంలో మొత్తం 6,909 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్దేశించుకున్నట్టు చెప్పారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో గ్రామ వ్యవసాయ సహాయకులు(వీఏఏ), టెక్నికల్ అసిస్టెంట్లు, కీలక భూమిక పోషించాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ధాన్యం అమ్మకాలు సాగించిన రైతులకు సంబంధించిన వివరాలను మిల్లర్లకు చేరవేయద్దని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు నిర్వహిస్తామని, రైతుల వద్ద మిగిలిన ధాన్యం వారు బహిరంగ మార్కెట్‌లో విక్రయాలు జరిపే విషయంలో కూడా ప్రభుత్వం గిట్టుబాటు ధర అందించేందుకు వ్యవసాయశాఖ అధికారులు బాధ్యత తీసుకుంటారని తెలిపారు. అదేవిధంగా రైతులు సాగు చేసిన బొండాలు రకం ధాన్యానికి ప్రభుత్వం త్వరలో మద్దతు ధరను ప్రకటిస్తుందని, ఈ ధర రైతులకు అందేలా చూస్తామన్నారు. ఆన్‌లైన్ విధానంలోనే కొనుగోళ్లు జరుపుతామని జేసీ స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసిన 21 రోజుల్లో రైతు ఖాతాల్లో సొమ్ము జమ అవుతుందని చెప్పారు.

బొప్పన వీర్రాజు కన్నుమూత

భౌతిక కాయాన్ని సందర్శించి, నివాళులు అర్పించిన మంత్రి వేణు, హైకోర్టు జడ్జి చక్రవర్తి



కందులపాలెంలో బొప్పన వీర్రాజు భౌతిక కాయం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి వేణు



వీర్రాజు భౌతిక కాయం వద్ద నివాళులు అర్పిస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ చక్రవర్తి



బొప్పన వీర్రాజు (ఫైల్)

రామచంద్రపురం రూరల్: కందులపాలేనికి చెందిన మాజీ మునసబు, ఎలక్ట్రికల్ బోర్డు మాజీ డైరెక్టర్, శ్రీదేవీ భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, హసన్‌బాద షిరిడీ సాయిబాబా ఆలయ కేర్‌టేకర్ బొప్పన వీర్రాజు(81) శనివారం రాత్రి కన్నుమూశారు. ఆయన మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఆయన గ్రామ మునసబుగా, ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం చైర్మన్‌గా, ఎలక్ట్రికల్ బోర్డు డైరెక్టర్‌గా సేవలందించారు. గ్రామానికి పెద్ద దిక్కుగా వ్యవహరించేవారు. గ్రామ అభివృద్ధికి కృషి చేశారు. గ్రామంలో సొసైటీ భవనానికి, పసువుల ఆసుపత్రికి స్థలాలను దానం చేశారు. అంతే కాకుండా హసన్‌బాదలో 130 అడుగుల కల్యాణ సాయి మహాస్థూపం, షిరిడి సాయి బాబా ఆలయ నిర్మాణానికి ప్రధాన రహదారిని పక్కనే ఉన్న ఎకరం స్థలాన్ని ఉచితంగా అందించారు. రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్‌కు అత్యంత సన్నిహితుడిగా మెలిగారు. బొప్పన వీర్రాజు భౌతిక కాయాన్ని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ, రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి, ఎంపీ బోస్ తనయుడు పిల్లి సూర్యప్రకాశ్, మాజీ జెడ్పీటీసీ ఇంత సంతోషం, మాజీ సర్పంచ్ వెంటపల్లి శేషారావు, ఉప సర్పంచ్ వెంటపల్లి రామకృష్ణ, గ్రామ కన్వీనర్ పెంకే వీర్రాఘవులు తదితరులు సందర్శించి, నివాళులు అర్పించారు.

ఎమ్మెల్సీ తోట చొరవతోనే పూలే విగ్రహం పునఃప్రతిష్ఠ



విలేకరులతో మాట్లాడుతున్న శెట్టిబలిజ సంఘం నాయకులు

కపిలేశ్వరపురం: వెదురుమూడిలో ఈ నెల11న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని అధికారులు తొలగించిన తర్వాత అదే ప్రదేశంలో విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించిన ఘనత ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవతోనే సాధ్యపడిందని వెదురుమూడి గ్రామ, కపిలేశ్వరపురం మండల శెట్టిబలిజ సంఘం నేతలు అన్నారు. అంగరలో ఆదివారం సంఘం నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారులు విగ్రహాన్ని తొలగించిన రోజునే సమస్యను తాము సంఘ పరంగా తేల్చుకుంటామని, ఎవ్వరూ ఘటనను రాజకీయం చేయవద్దని తాము చెప్పామన్నారు. అయినా కొందరు ఘటనను తమ రాజకీయ లబ్ధి కోసం రకరకాల ప్రకటనలు చేస్తున్నారని, అలా చేయడం సరికాదన్నారు. పైగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. విగ్రహాన్ని అధికారులు తొలగించిన రోజు నుంచి విగ్రహం పునఃప్రతిష్ఠించే వరకూ ఎమ్మెల్సీ తోట తమ సామాజిక వర్గీయులకు బాసటగా నిలిచారన్నారు. తొలగించిన చోటే విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించేందుకు కృషి చేసిన ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, కుడుపూడి సూర్యనారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు. పోలీసులు నమోదు చేసిన కేసులు తొలగింపునకు ఎమ్మెల్సీ తోట హామీ ఇచ్చారన్నారు. మాట్లాడినవారిలో గ్రామ శెట్టిబలిజ సంఘం నాయకులు పార్థ సారథి, మండల శెట్టిబలిజ సంఘం నాయకులు మేడిశెట్టి దుర్గారావు, శీలం గోవిందు, వాసంశెట్టి వాసు, నాయకులు పిల్లి శ్రీనివాస్, పెంకే గంగాధర్, మట్టపర్తి పాల్‌రాజు, కొప్పిశెట్టి శ్రీను, ఎంపీటీసీ మేడిశెట్టి దుర్గారావు, కురుపూడి వీరబాబు, చొల్లంగి శ్రీనివాస్, ఇళ్ల ఆంజనేయులు, గుత్తుల దుర్గారావు, గుత్తుల శ్రీను ఉన్నారు.

వారి స్నేహానికి 44 వసంతాలు

అనపర్తి: వారి స్నేహానికి వయసు నాలుగు దశాబ్దాలపై మాటే.. నలభై నాలుగు సంవత్సరాల క్రితం స్థానిక శ్రీరామారెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా కలుసుకున్నారు. దానికి స్థానిక జీబీఆర్ కళాశాల సమీపంలోని పద్మావతినగర్‌లో గల పద్మావతి ప్యాకింగ్ ప్రాడక్ట్స్ అవరణం వేదికయ్యింది. 1979-80 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు గ్రామానికి చెందిన వ్యాపారవేత్త ద్వారంపూడి నాగేంద్ర సత్యనారాయణరెడ్డి(జొన్నాడ దొరబాబు), కర్రి ఆదిరెడ్డిల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలిశారు. నలభై నాలుగు సంవత్సరాల క్రితం కలిసి విద్యాభ్యాసం చేసి ప్రస్తుతం వివిధ వృత్తుల్లో, వ్యాపార, ఉద్యోగాల్లో ఉన్న వీరు ఒక చోట కలిసుకుని అలనాటి మధుర స్మృతులను నెమరవేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడిగా చేశారు. అంతకు ముందుగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు సర్వేశ్వరరావు, వంకాయల సూర్యనారాయణమూర్తి, వంక సూర్యనారాయణమూర్తిలను ఘనంగా సత్కరించి గురువుల ఆశీస్సులు అందుకున్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు



మసీదులో ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: రంజాన్ మాసంలో స్నేహపూర్వక వాతావరణంలో ఇచ్చుకునే ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. పట్టణంలోని జామియా మసీదులో ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ముస్లిం పెద్దలు ఆయనకు ఘన స్వాగతం పలికి, ప్రార్థనలు చేశారు. అనంతరం ఇఫ్తార్ విందును స్వీకరించారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రదాయాలు సర్వమత సమ్మేళనమన్నారు. సోదరభావం విరాజిల్లే సంస్కృతి ప్రపంచ చరిత్రనే ఆకర్షిస్తుందన్నారు. ఇఫ్తార్ విందులో పాల్గొనడం తన మనసుకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని ఎమ్మెల్సీ అన్నారు. హడావిడిగా మారిన ఆధునిక జీవితంలో సైతం రంజాన్ పవిత్రమాసంలో క్రమశిక్షణతో ప్రార్థనలను చేయడం సంతోషకరమన్నారు. నియోజక వర్గంలోని ముస్లింలకు ఏ కష్టమొచ్చినా తాను అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ పాలకవర్గ కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ రబ్బానీ, మైనారిటీ నాయకులు ఎండీ అతావుర్ రెహ్మాన్, షేక్ గౌస్ మొహిద్దీన్, హర్షాద్, అన్సారీ, షేక్ ఇమామ్ సాహెబ్, షేక్ ఆరిఫ్, సయ్యద్ మైనర్ బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పోతంశెట్టి ప్రసాద్, ముమ్మిడివరపు బాపిరాజు, ముక్కా సుబ్రహ్మణ్యం, సాధనాల శివ భగవాన్, పులగం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో శెట్టిబలిజలకు ప్రాధాన్యం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శెట్టి బలిజ సంఘం నేతలు

రాయవరం: వైఎస్సార్ సీపీలో శెట్టిబలిజ సామాజిక వర్గానికి అధిక ప్రాధాన్యం ఉందని, ఈ విషయాన్ని ఆ వర్గీయులు గుర్తించాలని ఆ సంఘానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు సూచించారు. మండలంలోని చెల్లూరు రైతు భవనంలో వైఎస్సార్ సీపీ శెట్టి బలిజ సామాజిక వర్గ నేతలు ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీకి చెందిన శెట్టి బలిజ సామాజికవర్గ నేతలు కొప్పిశెట్టి మాధవరావు తదితరులు ఈ నెల 15వ తేదీన విలేకరుల సమావేశంలో చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. ఈ సందర్భంగా పలివెల రామకృష్ణ మాట్లాడుతూ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును విమర్శించే అర్హత తనకు ఎందుకులేదో సమాధానం చెప్పాలన్నారు. ఎమ్మెల్యే జోగేశ్వరరావు మాదిరిగా తనపై ఇసుక దోపిడీ ఆరోపణలు లేవనా? ఎన్నికల్లో డబ్బు సంచులతో వచ్చి పంపకాలు చేయలేదనా? అంటూ ప్రశ్నించారు. ఎమ్మెల్సీ త్రిమూర్తులు నిబద్ధత కలిగిన నాయకుడని, మళ్లీ ఎన్నికల్లో ఆయనను గెలిపించుకుంటామన్నారు. శెట్టి బలిజ నేతలు పాలిక గోవిందు, పిల్లి ప్రసాద్, సర్పంచి వాసంశెట్టి వెంకట్రావు, మాజీ ఎంపీపీ రాయుడు సత్యనారాయణ(కోస), మాజీ సర్పంచ్ వాసంశెట్టి రాధాకృష్ణ, శెట్టిబలిజ సంఘం నేతలు పరంశెట్టి వెంకటరమణ, పిల్లి సుబ్రహ్మణ్యం తదితరులు మాట్లాడారు.

రవికుమార్ సేవలు స్ఫూర్తిదాయకం



రవికుమార్‌ను సత్కరిస్తున్న రామచంద్రపురం మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి

రాయవరం: చేయూత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మొండి రవికుమార్ సేవలు స్ఫూర్తిదాయకమని రామచంద్రపురం మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అన్నారు. మండలంలోని పసలపూడి కళానగర్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం రవికుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని శ్రీదేవి మాట్లాడుతూ రవికుమార్ చేయూత సంస్థ ద్వారా ఎంతో మందిని ఆదుకుంటున్న తీరు అభినందనీయమన్నారు. అలాంటి వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ సమాజ సేవలో ముందుండాలన్నారు. ఏషియన్ వేదిక్ యూనివర్సిటీ ద్వారా గౌరవ డాక్టరేట్‌ను అందుకున్న రవికుమార్‌ను కళానగర్ యూత్ సభ్యులు దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

సంక్షేమమే ధ్యేయంగా జగన్ పాలన

అనపర్తి: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుస్థిరమైన, సుపరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని మహేంద్రవాడ రజకుల పేటలో గ్రామ పంచాయతీ నిధులు రూ.5 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలు మొత్తం రూ.10 లక్షలతో నిర్మించిన బీసీ కమ్యూనిటీ భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సంక్షేమమే కోరుతూ ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో మంచి చేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పడాల ధర్మారెడ్డి, ఉపసర్పంచ్ మల్లిడి గంగరాజు, సొసైటీ అధ్యక్షుడు తాడి వెంకట సత్యనారాయణ రెడ్డి, దేవస్థానం అధ్యక్షుడు సబ్బెళ్ల సత్తిరెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ తేతలి వెంకటరెడ్డి, టి.రామారెడ్డి, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.